




కొమ్మాలపాటిని ఎమ్మెల్సీ వరించేనా!

● అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పేరు ● ఆశావహుల్లో జంగా సహా మరికొందరు నేతలు 8

పంది కొక్కుల దాడిలో శిశువు మృతి

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం 6

బియ్యంతో సరి



రేషన్‌లో కోతలే కోతలు

- కందిపప్పు సహా సరుకుల పంపిణీ బంద్
- ప్రభుత్వ తీరుపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి
- బహిరంగ మార్కెట్‌లో మండుతున్న కందిపప్పు, నూనెలు

రేషన్ అంటే.. బియ్యంతో సరిపెడుతున్నారు. గతంలో కందిపప్పు, జొన్నలు, రాగులు, గోధుమ పిండితో పాటు బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్నంటేలా ఉండే నిత్యావసరాలను సబ్సిడీపై సరఫరా చేసేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ వ్యవస్థలో విపరీత మార్పులు తేవడంతో పాటు సరుకుల్లో కోతలు పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలుత గత టీడీపీ హయాంలో ఇచ్చినట్లుగా సరుకులను కార్డుదారులకు అందించారు. ఆ తర్వాత యథావిధిగా రేషన్ అంటే ఒక్క బియ్యం అన్నట్లుగా మార్చేశారు. పంచదార ఇస్తున్నా అది అందరికీ అందడం గగనమవుతోంది.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఏ నెలకానెల రేషన్ సరుకుల్లో మార్పులు తెస్తామని చెప్తున్నా అది ప్రకటనలకే పరిమితమవుతోంది. రేషన్ సరుకుల్లో కొత విధిస్తూ వస్తున్న ప్రభుత్వం ఈ నెల కూడా బియ్యం.. పంచదారకే పరిమితం చేసింది. కార్డుదారులకు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించినా అది కొన్ని నెలలకే పరిమితమైంది. కందిపప్పు.. సరఫరా పూర్తిగా నిలిపేయడంపై కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌లో సరుకుల కోత తో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం గతంలో రాయితీపై కందిపప్పు కిలో రూ.67కు ఇచ్చేది. ఈ క్రమంలో రాయితీపై పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని కార్డుదారులు విమర్శిస్తున్నారు. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను దారుణంగా దెబ్బ తీసింది. పౌర సరఫరాల వ్యవస్థ మొత్తం గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమై పోయింది. కూటమి ప్రభుత్వం రాకతో పరిస్థితి మారుతుందని, గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, రాగులు, శనగలు అందుతాయని నిరుపేదలు ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలినాళ్లలో ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసినా అది మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. కంది పప్పు, రాగులు, జొన్నల నిల్వలు సరఫరా లేకపోవడంతో వాటి సరఫరాలో ఆటంకాలు తలెత్తుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరుకుల రవాణాలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి, తక్షణ ప్రాతిపదికన కందిపప్పు, రాగులు, జొన్నలు, గోధుమ పిండి వంటి సరుకులు పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది.

కందిపప్పు ధర రూ.180

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ధర ఉంది. ప్రభుత్వం కార్డుదారులందరికీ ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయక పోవడంతో సామాన్యులు ఇంట్లో పప్పు ఉడకడంలేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం కార్డుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మార్కెట్‌లో కంది పప్పు ధర పెరిగే సమయంలో గతంలో కార్డుదారులకు రేషన్ సరుకుల్లో, ఇతరులకు రైతుబజార్లలో సబ్సిడీపై సరఫరా చేయడాన్ని పౌరసరఫరాలశాఖ పూర్తిగా విస్మరించింది. కార్డుదారులు కొన్ని నెలలుగా కందిపప్పు అడిగితే ఎండీయూ వాహనదారులు రాలేదని సమాధానం ఇస్తున్నారు. నూనెల ధరలు సలసలా కాగుతున్న నేపథ్యంలో చౌక ధరల్లో పామాయిల్ అందించాల్సిన అవసరం ఉంది. నిత్యావసర ధరలు మండిపోతున్న తరుణంలో రేషన్ ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తే పేదల ఆకలి తీరుతుంది.

అరకొరగానే సరఫరా..

గత నెలలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అరకొరగానే కందిపప్పు సరఫరా అయింది. ఈ నెలలో కందిపప్పు, జొన్నలను పూర్తిగా నిలిపేశారు. పల్నాడు జిల్లాలో 6,34,893 తెల్ల కార్డులు ఉండగా ఈ నెలలో 3.62 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసినట్లు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,76,529 తెల్ల కార్డులకు 1.07 శాతం, గుంటూరు జిల్లాలో 5,89531 కార్డులకు 1.43 శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేశారు.

● రేషన్ సరఫరాపై అధికారుల నియంత్రణ

రోజుకు 150 కార్డులకే సరఫరా

రేషన్ కార్డుదారులకు కూటమి ప్రభుత్వంలోనూ కష్టాలు తప్పడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థతోనే ఇబ్బందులు పడుతున్న కార్డుదారులకు.. రేషన్ సరుకుల సరఫరాలో అధికారుల నియంత్రణ చర్యలు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి జరగాల్సిన పంపిణీలో అధికారుల నిర్వాకంతో జాప్యం జరుగుతోంది. కొత్త కొత్త నిబంధనలను తెర మీదకు తెచ్చి రేషన్ పంపిణీలో జాప్యం చేస్తున్నారు. ఈ నెల రేషన్ పంపిణీలో పౌర సరఫరాల అధికారులు కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు. రేషన్ సరఫరా చేసే ఎండీయూ వాహనాలకు నియంత్రణ విధించారు. ఒక్కో ఎండీయూ రోజుకు 150 కార్డులకు మించి రేషన్ సరఫరా చేయకూడదని ఆదేశించారు. ఒక్కో ఎండీయూ వాహనం ఒక రోజులో సగటున 300 కార్డులకు రేషన్ సరఫరా చేస్తుంటుంది. అలాంటిది ఈ నెల నుంచి ఒక్కో ఎండీయూ రోజుకు 150 కార్డులకు మించి రేషన్ సరఫరా చేయకూడదని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ఎండీయూ వాహనదారులు ఒక పూట సరుకులు సరఫరా చేసి రెండోపూట ఆపేస్తున్నారు. దీంతో ఎండీయూ వాహనాల కోసం ఎదురు చూసే రోజు కూలీలు, చిరు ఉద్యోగులు పనులు మానుకుని ఇంకో రోజుపాటు ఎదురు చూడాల్సి వస్తోంది.

వేసవి దృష్ట్యా నిబంధన

వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని రేషన్ సరఫరాను పరిమితం చేశాం. ఉదయం 100 కార్డులు, సాయంత్రం 100 కార్డులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఎండీయూ వాహనదారులకు సూచించాం. కార్డుదారులు ఎండలో నించుని ఇబ్బందులు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నాం. రోజుకు 200 చొప్పున ఇచ్చినా 17 రోజుల్లో రేషన్ పంపిణీ చేయడం పూర్తవుతుంది. జాప్యమేమీ ఉండదు.

- కోమలి పద్మ, డీఎస్‌వో

గుంటూరు.. ఎగుమతుల హబ్



- డీఈహెచ్ స్కీంకి ఎంపిక చేసిన కేంద్రం
- ఇక ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తులు, ఎగుమతుల పెంపు
- మిర్చి, పసుపు, పత్తినూలు రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ
- బాపట్లలో గ్రానైట్, రొయ్యల ప్రాసెసింగ్ ఉత్పత్తులకు ఊతం
- పల్నాడు ప్రాంతం నుంచి టెక్స్‌టైల్స్, సుగంధ ద్రవ్యాల ఎగుమతి

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి, పసుపు, పత్తినూలు ఉత్పత్తిలో ఉమ్మడి గుంటూరు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా పేరుగాంచింది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జిల్లా ఎగుమతుల హబ్ (డీఈహెచ్) పథకానికి ఉమ్మడి గుంటూరు జిల్లాను ఎంపిక చేసింది. రాష్ట్రంలో మూడు ఉమ్మడి జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా ఉమ్మడి గుంటూరుకు కూడా ఇందులో చోటుదక్కించుకున్నది. ఈ స్కీమ్‌తో ఆయా రంగాల్లో ఉత్పత్తుల పెరుగుదలతో పాటు పెట్టుబడులను ఆకర్షించే చర్యలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది. ఆయా ఉత్పత్తులు, ఎగుమతులను గణనీయంగా పెంచే వాతావరణాన్ని కల్పిస్తారు. టెక్నాలజీ వినియోగానికి ఏకో సిస్టమ్‌ని కూడా అమలు చేసి ఎగుమతిదారుల మధ్య పోటీ తీసుకువస్తారు. దీంతో ఎగుమతి దారులకు వివిధ దశలలో లావాదేవీల ఖర్చు తగ్గనుంది. అలానే ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుంది. డీఈహెచ్ స్కీమ్ ఇటీవలే ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కార్య క్రమంతో సమ్మిళితం చేసింది. ప్రధానంగా సప్లై చైన్ సిస్టమ్‌లో ఉన్న ఆటంకాలను గుర్తించి జిల్లా ఎగు మతుల ప్రణాళికలో చర్చించి పరిష్కరిస్తారు. 2030 నాటికి ఎగుమతుల్లో రెండు ట్రిలియన్ల యూఎస్ డాలర్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు ఈ డీఈహెచ్ పని చేస్తుంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో మిర్చి సాగు చేస్తే 6.25 మెట్రిక్‌టన్నుల దిగు బడి వస్తుంది. అదే బాపట్లలో 6.20, పల్నాడులో 6.25 ఎంటీల దిగుబడి లభిస్తుంది. గతంలో గోనె సంచుల్లో పత్తినూలు, మిర్చి, పసుపు నింపి ఎగుమతి చేసేవారు. అయితే ఇటీవల కాలంలో దిగుమతి చేసుకుంటున్న దేశాల్లోని కంపెనీల సూచనల మేరకు ప్యాకింగ్స్‌లో మార్పులు చేశారు. ప్యాకింగ్, బ్రాండింగ్‌లో ఇంకా మార్పులు జరగాల్సి ఉన్నది. కాగా బాపట్ల జిల్లాలో రొయ్యలను ప్రాసెసింగ్ చేసి తయారు చేసే ఉత్పత్తులు, గ్రానైట్, ప్రత్తి నూలు, ఎసెన్షియల్ ఆయిల్స్ పల్నాడు జిల్లా నుంచి సుగంధద్రవ్యాలు, టెక్స్‌టైల్స్‌ని ఎగుమతులకు గుర్తించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఉమ్మడి గుంటూరు జిల్లా ఒక ఎగుమతుల హబ్‌గా మారుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్

అంతర్జాతీయంగా ఇక్కడి ఉత్పత్తులకు ఈ-కామర్స్ డిజిటల్ మార్కెటింగ్ విధానాల ద్వారా డిమాండ్ ఏర్పడేలా





చేస్తుంది. కిందిస్థాయిలో ఎగుమతుల ప్రోత్సాహం, ఉత్పాదకత, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చేసుకుని కేంద్ర వాణిజ్య శాఖకు సంబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ సంస్థ డీఈహెచ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే డీజీఎఫ్‌టీ అమేజాన్ ఇండియా, షిప్ రాకెట్, డీహెచ్‌ఎల్ వంటి సంస్థలో ఒప్పందాలు కుదుర్చుకున్నది. స్థానిక ఎగుమతిదారులకు మద్దతివ్వడం, ఈ-కామర్స్ ఎగుమతులను ప్రమోట్ చేయడం, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌పై వ్యక్తిగత సామర్థ్యం పెంచడం కోసం ఎంఎస్ఎంఈలకు వర్క్‌షాపులను నిర్వహిస్తున్నది.

మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ

- ఆరేళ్ల తర్వాత ఆర్థిక కష్టాలకు చెక్
- ఇక నుంచి బిల్లుల చెల్లింపులకు అవకాశం
- పట్టణాల్లో అభివృద్ధి పనులకు సానుకూల పరిస్థితి

సత్తెనపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నా నిధులు వినియోగించుకునే అవకాశం లేక ఇంతకాలం మున్సిపాలిటీలు ఇబ్బందులు పడుతుండేవి. నిధులు ఉన్నా బిల్లులు చెల్లింపులు చేసుకోలేక.. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపులతో ఉండాల్సి వచ్చేది. మున్సిపాలిటీల్లో పనులు అంటే కాంట్రాక్టర్లు పారిపోయేవారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక ఇలాంటి కష్టాలకు చెక్ పడేలా కూటమి ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపాలిటీలకు ఆర్థిక స్వేచ్ఛ లభించింది. ఇక నుంచి ప్రభుత్వ అనుమతితో సంబంధం లేకుండా నిధులను వినియోగించుకునే అవకాశం మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఆరేళ్ల కష్టాలకు చెక్ పడినట్లుగా మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు భావిస్తున్నారు. 2018కి ముందు మున్సిపాలిటీల నుంచే నేరుగా బిల్లులు చెల్లింపులు జరిగేవి. దీంతో ఎక్కడికక్కడ మున్సిపాలిటీల వారీగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిగేవి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. దీంతో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా ఉన్న మున్సిపాలిటీల పరిస్థితి మారింది. ఆర్థిక పుష్టి ఉన్నప్పటికీ నిధులు ఖర్చు చేసుకునే అవకాశం లేక పురపాలక సంఘాలు అల్లాడిపోయేవి. కనీసం వెయ్యి రూపాయలు ఖర్చు చేసినా సంబంధిత బిల్లు వెంటనే చెల్లించే అవకాశం లేకుండా పోయింది. మున్సిపాలిటీలకు సంబంధించి 001, 002 ఆర్థిక సంఘం నిధులు, పద్దులు ఉంటాయి. వీటి ద్వారా వచ్చే నిధులను మున్సిపాలిటీలు ఖర్చు చేసుకుంటాయి. అయితే ఈ పద్దుల అజమాయిషీ ప్రభుత్వం చేతుల్లో ఇప్పటి వరకు ఉంది. అందువల్ల రూపాయి ఖర్చు పెట్టినా సీఎఫ్‌ఎంఎస్ నుంచే తీసుకునే పరిస్థితి. అది కూడా ఎప్పుడు మంజూరు చేస్తారో అనేది కూడా ప్రశ్నార్థకమే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా మున్సిపాలిటీల నుంచే నిధులు చెల్లించే అవకాశం కల్పించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మున్సిపల్ పట్టణాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టే అవకాశాలు ఉన్నాయి.



సీఎఫ్ఎంఎస్‌తో కష్టాలే కష్టాలు

2019 చివరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వం సీఎఫ్‌ఎంఎస్ విధానం అమల్లోకి తీసుకువచ్చింది. మున్సిపాలిటీలకు సంబంధించిన నిధులు కూడా ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లాయి. మున్సిపాలిటీలు బిల్లులు చెల్లించాలంటే సీఎంఎఫ్‌లో నమోదు చేస్తే ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలి. ఆ తర్వాతే నిధులు విడుదలయ్యేవి. దీంతో మున్సిపల్ పట్టణాల్లో అత్యవసర, ఇతర ఏ అభివృద్ధి పనులు చేసినా నిధులు మంజూరు కాని పరిస్థితి నెలకొంది. బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు అల్లాడిపోయేవారు. సంబంధిత బిల్లుల చెల్లింపులపై సమాధానాలు చెప్పలేక అధికారులు కూడా నలిగిపోయారు. ఈ పరిస్థితుల్లో ఆరేళ్లుగా మున్సిపాలిటీల్లో పనులు అంటే కాంట్రాక్టర్లు పారి పోయే పరిస్థితి నెలకొంది. చాలా మున్సిపాలిటీల్లో కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వచ్చే నెల నుంచి అమలు..

సీఎఫ్ఎంఎస్ విధానానికి చెక్ చెప్తూ కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలు నేరుగా నిధులు వ్యయం చేసుకునే అవకాశం కల్పించింది. ఈ విధానం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. అయితే నిధుల ఖర్చుకు సంబంధించి గతంలో నిబంధనలే అమలు చేస్తారా?, కొత్తగా ఏమైనా మార్పులు చేస్తారా? అనేది ఇంకా స్పష్టం కాలేదు. కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు వచ్చే అవకాశంతో పాటు ఏదైనా అత్యవసర పనులను వెంటనే చేపట్టే అవకాశం మున్సిపాలిటీలకు వచ్చింది. కూటమి ప్రభుత్వం నిర్ణయం పట్టణాభివృద్ధికి దోహద పడుతుందని పలువురు కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో దాదాపు ఆరేళ్లు మున్సిపాలిటీలు ఆర్థిక చెల్లింపుల్లో పడుతున్న ఇబ్బందులు తొలిగిపోయినట్లే.

మద్యం షాపులకు నేడు లాటరీ

జిల్లాలో 13 దుకాణాలకు 199 దరఖాస్తులు

నరసరావుపేట లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గీత కార్మిక కులాలకు జిల్లాలో కేటాయించిన 13 మద్యం షాపులకు గురువారం లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్లో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీయనున్నారు. ఈ ప్రక్రియ అంతా ఫిబ్రవరి 8నాటికే ఓ కొలిక్కి వచ్చింది. వెంటనే లాటరీ జరిపి షాపులు కేటాయించాల్సి ఉండగా ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి రావడంతో తర్వాత ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. తాజాగా ఫలితాలు వెల్లడి కావడంతో కోడ్‌ను ఎత్తివేస్తున్నట్లు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. దీంతో గతంలో నిలిచిపోయిన లాటరీ ప్రక్రియను మళ్లీ ప్రారంభించడానికి ఎక్సైజ్‌శాఖ సమాయత్తమైంది. జిల్లా వ్యాప్తం గా 13 మద్యం దుకాణాలకు 199 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమం లో పాల్గొనాలని అధికారులు కోరారు. దరఖాస్తు దారులు అప్లికేషన్ కాపీతో పాటు ఎంట్రీ పాస్, తహసీల్దారు జారీ చేసిన కుల, ఉపకుల ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకు రావాలి. లాటరీలో మద్యం షాపులు పొందిన దరఖాస్తు దారుడు మొదటి విడత నగదును వెంటనే చెల్లించాల న్నారు. ప్రతి దుకాణానికి ఒక దరఖా స్తుదారుడితో పాటు ఇద్దరు రిజర్వు దరఖాస్తుదారులను కూడా ఎంపిక చేయనున్నారు.

లోయలో పడిన లారీ.. ముగ్గురు మృతి

- మృతుల్లో ఇద్దరు పల్నాడు జిల్లా వాసులు
- కడప జిల్లాలో ఘటన.. చిలకలూరిపేటలో విషాదం

సీకేదిన్నె(కడప), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌గా, క్లీనర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు కడప జిల్లాలో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. నరసరావుపేటకు



లోయలో పడి నుజ్జునుజ్జు అయిన లారీ

చెందిన అశోక్ అనే లారీ యజమాని వద్ద చిలకలూరిపేటకు చెందిన సాంబయ్య(46) డ్రైవర్‌గా, నాగరాజు(44) క్లీనర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సాంబయ్య, నాగరాజులు చేపల దాణా తీసుకుని బెంగళూరు నుంచి ఏలూరుకు లారీలో బయలుదేరారు. కడప జిల్లా రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ దిగుతూ నాలుగో మలుపు వద్ద లారీ అదుపు తప్పింది. దాదాపు 50 అడుగుల లోయలో పడిన లారీ నుజ్జునుజ్జు అయింది. దీంతో సాంబయ్య, నాగరాజుతో పాటు మార్గమధ్యలో లారీ ఎక్కిన గువ్వలచెరువు వద్ద చక్రాయపేట మండలానికి చెందిన కొవ్వూరు వివేకానందరెడ్డి(38) అనే ప్రయాణికుడి సహా ముగ్గురూ క్యాబిన్‌లో చిక్కుకుపోయారు. సాంబయ్య, నాగరాజు అక్కడికక్కడే చనిపోగా వివేకానందరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని రప్పించి గ్యాస్‌కట్టర్లతో క్యాబిన్‌ను కట్ చేసి వారిని బయటకు తీశారు. కొనప్రాణంతో ఉన్న వివేకానందరెడ్డిని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అనంతరం అంబులెన్స్‌లో డ్రైవర్, క్లీనర్ మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో చిలకలూరిపేటలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసుల సమాచారంతో మృతుల బంధువులు కడప రిమ్స్‌కు బయల్దేరినట్లు సమాచారం.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఆదేశాలు

నరసరావుపేట రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లా, మండల స్థాయి అధికారులు శ్రద్ధ వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదు ఎక్కడ నుంచి వచ్చినది పరిశీలించి పరిష్కరించాలన్నారు. సీఎంకు ఇచ్చిన వారికి ఎండార్స్మెంట్ ఉన్న ఫిర్యాదుల విషయంలో సంబంధిత అధికారులు విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఏ ఫిర్యాదు రీ ఓపెన్ కాకూడదన్నారు. ఫిర్యాదుదారుడితో అధికారి మాట్లాడాలని, నివేదికను వారికి ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎంకి ఇచ్చిన వారి ఎండార్స్మెంట్ ఉన్న ఫిర్యాదుల విషయంలో తప్ప మిగిలిన అన్ని ఫిర్యాదులు సంబంధిత అధికారి క్లోజ్ చేయవచ్చన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై నాలుగు స్థాయిల్లో ఆడిట్ జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారుతో మాట్లాడకపోయినా, నివేదిక వారికి ఇవ్వకపోయినా, తప్పు ఎండార్స్మెంట్ ఇచ్చినా ఆడిట్లో ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. సీఎంకి ఇచ్చిన వారి ఎండార్స్మెంట్ ఉన్న ఫిర్యాది ఇంకొల్లుకు చెందిన గంట సుబ్బారావుతో కలెక్టర్ నేరుగా ఫోన్లో మాట్లాడారు. ఫిర్యాదుదారు చెప్పిన అంశాలపై దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులతో మాట్లాడి రికార్డుల పరిశీలనకు ఈ నెల 10వ తేదీన సమయం ఇచ్చారు. మరొక ఫిర్యాదు అచ్చంపేట మండలం నిండుచెర్ల గ్రామానికి చెందిన మరో ఫిర్యాది నాగరత్నమ్మతో కూడా కలెక్టర్ ఫోన్లో మాట్లాడారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.21 (గురువారం)

సహరి : 5.05 (శుక్రవారం)

నేటి నుంచి గుడారాల పండుగ

- దయాక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన విశ్వాసులు
- లేమల్లె ప్రాంగణంలో హోసన్న మందిరం ప్రారంభం 8





● హోసన్న మందిరం ప్రారంభిస్తున్న పాస్టర్ మోహన్ సీ లాజరస్, జాషువా మోజెస్, అబ్రహాం, జాన్‌వెస్లీ ఇతర దైవజనులు, హాజరైన భక్తులు

పందికొక్కుల దాడిలో శిశువు మృతి


మృతి చెందిన బాలుడు

నూజెండ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పందికొక్కుల దాడిలో మూడు నెలల పసికందు మృతి చెందిన సంఘటన మండలంలోని రవ్వవరం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయని కొండ గురవయ్య, దుర్గమ్మ ఊరు బయట గుడారంలో నివశిస్తూ గాజులు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. వీరికి అప్పటికే మూడు సంవత్సరాల పాప ఉండగా, మూడు నెలల క్రితం మూడు రోజుల దివ్యాంగుడైన పసి బాలుడిని తీసుకొని వచ్చి పెంచుకుంటూ కౌషిక్‌గా పేరు పెట్టారు. బుధవారం ఉదయం తమ కుమార్తె దుకాణం వద్దకు వెళ్లేందుకు ఏడుస్తుండటంతో బాలుడిని ఇంట్లో పండుకొన బెట్టి కుమార్తెను తీసుకొని దుర్గమ్మ దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చేలోగా ఇంటిలో నేలపై పండుకున్న కౌషిక్‌ను పందికొక్కులు తీవ్రంగా గాయపర్చాయి. బాలుడు ఏడుస్తుండటంతో తీవ్ర గాయాలైన కౌషిక్‌ను తీసుకొని దుర్గమ్మ గ్రామంలోని వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విన్యాసమ్మ, అంగన్, వైద్య సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కౌషిక్ వివరాలు అంగన్ వాడీ కేంద్రాల్లో నమోదై ఉండక పోవటం, ఆషా కార్యకర్త వద్ద మాత్రమే నమోదై ఉన్నాయని వారు తెలిపారు. సరైన నివాస వసతి లేక పోవటం వల్ల బాలుడు పది కొక్కులకు బలయ్యాడని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తమకు మగ బిడ్డ లేడని తీసుకువచ్చి పెంచుకోవటం కూడా గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఐనవోలు ఎస్‌ఐ బి.వి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తవ్వకాల్లో పురాతన విగ్రహాలు లభ్యం


తవ్వకాలలో బయటపడ్డ సుమారు 700 ఏళ్ల నాటి విగ్రహాలు

ముప్పాళ్ళ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ముప్పాళ్ళలో ముస్లిం ఏరియాలో శివాలయానికి, మసీదుకు సమీపంలో అతి పురాతన కాలం నాటి పడగవిప్పిన నాగేంద్ర స్వామి విగ్రహం, గొల్లబామ విగ్రహం తవ్వకాలలో బయటపడ్డాయి. గ్రామానికి చెందిన వారు జేసీబీతో తవ్వడంతో సుమారు 10 అడుగుల లోతులలో బయట పడ్డాయని గ్రామస్తులు బుధవారం తెలిపారు. గతంలో అదే ప్రాంతంలో వినాయకుని విగ్రహం బయట పడటంతో విగ్రహాన్ని వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించారు. ప్రస్తుతం లభించిన చోళ కాలం విగ్రహాలుగా గుర్తించామని, శాస్త్రోక్తంగా పూజలు చేసి విగ్రహాలను గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో పునఃప్రతిష్ఠింపజేస్తామని గ్రామ ప్రధాన అర్చకులు నారాయణం శ్రీనివాసమూర్తి తెలిపారు. పురాతన విగ్రహాలను పురావస్తు శాఖ అధికారుల పరిశీలన అనంతరం దేవదాయశాఖ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా విగ్రహాలను ఆలయానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.భవాని శంకర్ తెలిపారు.

అందరికీ ఆమోదయోగ్యమైన కేంద్ర బడ్జెట్

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ


పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు ఎంతో ఆమోదయోగ్యమైనదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినిశర్మ పేర్కొన్నారు. బుధవారం బాపట్ల విచ్చేసిన ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలో, బాపట్ల జిల్లాకు కేంద్రం అందించిన సహకారం గురించి వివరించారు. వందల కోట్ల రూపాయలతో కొరిశపాడు దగ్గర 4.1 కిలోమీటర్ల ఎమర్జన్సీ ల్యాండింగ్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో సుకోయ్‌లాంటి యుద్ధ విమానాలు సైతం అక్కడ దిగవచ్చు అన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులు కూడా పంచాయతీలకు, మున్సిపాలిటిలకు అందాయన్నారు. రూ. 1064.24 కోట్లతో నూతనంగా 167ఎ జాతీయ రహదారి నిర్మాణంతో రవాణా వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ హైవేతో చీరాల నుంచి సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ప్రోత్సాహంతోపాటుగా బాపట్ల-ఓడరేవు మధ్య బీచ్‌టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాపట్ల-చుండూరు మధ్య 32 కిలో మీటర్ల రైలుమార్గం, బాపట్ల-సూరారెడ్డిపాలెం మధ్య 74 కిలో మీటర్ల రైలుమార్గం వేయటమే కాక బాపట్ల, చీరాల, రేపల్లె రైల్వేస్టేషన్‌లను అమృత్ స్టేషన్‌ల జాబితాలో చేర్చి కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇవేకాకుండా జిల్లాలో నిజాంపట్నం ఆక్వాపార్క్ రూ. 300 కోట్లతో, ఫిషింగ్ హార్బర్ రూ. 438 కోట్లతో నిర్మించిందని ఆమె పేర్కొన్నారు. సాగరమాల ద్వారా ఈ సంవత్సరం రూ. 2243 కోట్లను రాష్ట్రానికి ఇచ్చినట్లు తెలిపారు. పీఎం మత్స్య సంపద కింద ఈ సంవత్సరం రాష్ట్రానికి రూ. 15 వేల కోట్లు కేటాయించారని ఆమె వివరించారు. ఇంకా మరెన్నో ప్రాజెక్ట్‌లకు కేంద్రం నిధులివ్వగా జిల్లాలో వాటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. బడ్జెట్ గురించి దేశవ్యాప్తంగా జరుగుతున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా తాను వచ్చినట్లు తెలిపారు. వేతనజీవులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆదాయ పన్ను మినహాయింపు రూ. 12లక్షల వరకు ఇవ్వటం ఎంతో మంది మధ్యతరగతి వేతనజీవులకు ఊరటనిస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలవరం నిర్మాణం కోసం నిధులు, ప్రధానమంత్రి ఆవాసయోజన పథకం కింద రాష్ట్రానికి ఇళ్ల కేటాయింపులో అగ్రస్థానం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిపై నిబద్ధతకు నిదర్శనమన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, రూరల్ అధ్యక్షుడు పేరి రెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మిమిడి రమేష్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కరీముల్లా, బాబునాగేంద్ర పాల్గొన్నారు.

ప్రార్థన ద్వారా పరలోకం సిద్ధిస్తుంది

● గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య


మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ప్రార్థన, ఉపవాసం, దాన ధర్మాలు చేయటం ద్వారానే మోక్ష ప్రాప్తి జరుగుతుందని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు ఫిరంగిపురంలోని బాల ఏసు కథెడ్రల్ దేవాలయంలో విభూది బుధవారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు ప్రతి ఏడాది క్రీస్తు శ్రమల కాలం ప్రత్యేక దినాలుగా ఉంటాయన్నారు. ఈ 40 దినాలు ఉపవాస దీక్షలు చేస్తూ నిష్ఠతో నియమాలను పాటిస్తూ జీవించాలన్నారు. దీని ద్వారా ఈస్టర్ పండగకు సంసిద్ధులు కావాలన్నారు. క్రీస్తు శ్రమల కాలంలో క్రైస్తవులు మూడు ఆయుధాలు కలిగి ఉండాలన్నారు. ప్రార్థన, ఉపవాసం, ధాన ధర్మాలు చేస్తూ జీవించాలన్నారు. క్రీస్తు శ్రమలను అత్యంత పవిత్రంగా ధ్యానించాలని ఆయన తెలిపారు ఈ సందర్భంగా 450 మంది క్రైస్తవులు జపమాలను ధరించి ప్రత్యేక దీక్షలు చేపట్టారు. పూజాబలిలో దివ్య సత్ప్రసాదాన్ని బిషప్ భాగ్యయ్య భక్తులకు పంపిణీ చేశారు. పూజలో బాల ఏసు చర్చి ఫాదర్ ఎం పాతిమా మర్రెడ్డి, ఫాదర్ ప్రవీణ్, ఫాదర్ రవీంద్ర, ఫాదర్ మద్దు బాలస్వామి, ఫాదర్ విలియమ్, గుడి పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేతగా తెనాలి జేఎంజే


విజేతగా నిలిచిన జేఎంజే జట్టును అభినందిస్తున్న ఎంపిక కమిటీ సభ్యులు, ముఖ్యఅతిథులు

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజేతగా తెనాలి జేఎంజే కళాశాల నిలచిందని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు బుధవారం తెలిపారు. ద్వితీయ స్థానంలో ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్స్ కళాశాల, మూడో స్థానంలో ఎంఏఎం ఫార్మసీ కళాశాల నిలిచాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన చిలకలూరిపేట శ్రీనిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ శిరీష, ఏఎన్‌యూ యోగా సెంటర్ కోఆర్డినేటర్ డి. సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఆటలో గెలుపు, ఓటములు సహజమన్నారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, టోర్నమెంట్ చైర్మన్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, పీడీ జె.శంకర్, కమిటీ సభ్యులు సీహెచ్ వెంకటరావు, జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా ఎంఏఎం ఫార్మసీ విద్యార్థులు యు.అఖిల, షేక్ ఆఫ్రీన్ ఆల్ ఇండియా మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయ్యారని డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. మార్చి 29న కరైకుడిలోని అల్గాప్ప విశ్వవిద్యాలయంలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

పెన్షన్ కోసం వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు నిరసన


వీసీ చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేస్తున్న వర్సిటీ విశ్రాంత ఉద్యోగులు

పెదకాకాని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకి సంబంధించిన పెన్షన్లు విశ్రాంత అధ్యాపకులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు బుధవారం నిరసనకు దిగారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీసీ చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య విష్ణువర్ధన్, కార్యదర్శి శివప్రసాద్, విశ్రాంత ఉద్యోగి మల్లేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు బుధవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావును ఆయన చాంబర్లో కలిశారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలకు సంబంధించిన జీతాలను యూనివర్సిటీ రెగ్యులర్ ఉద్యోగులకు యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, అధ్యాపక సిబ్బందికి, విశ్రాంత అధ్యాపకేతర ఉద్యోగులకు కూడా ఫిబ్రవరి నెలకు సంబంధించిన పెన్షన్లు యూనివర్సిటీ నిధుల నుంచే చెల్లించారని, కానీ యూనివర్సిటీలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన రెగ్యులర్ అధ్యాపకులకు మాత్రం నిధులు లేవన్న సాకుతో పెన్షన్ నిలిపియడం సరికాదని వారు వీసీ దృష్టికి తీసుకువచ్చారు. డీఏ బకాయి కూడా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు తాము నిరసన విరమించమని వీసీ చాంబర్లో నేలపై కూర్చున్నారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం పెన్షనర్లతో చర్చలు జరిపారు. సోమవారం నాటికి పెన్షన్లు చెల్లిస్తామని తెలిపారు. డీఏ బకాయి కూడా చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

అప్పు చెల్లించలేదని ఆత్మహత్యకు ప్రేరేపణ

● గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి

పిడుగురాళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించలేదని ఆ వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన ఘటన రెండు రోజుల క్రితం పిడుగురాళ్లలో జరిగింది. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లికి చెందిన ముప్పాళ్ల అంజిబాబు అదే పట్టణానికి చెందిన షేక్ మాబుసుభాని వద్ద రెండున్నర లక్షలు అప్పు తీసుకున్నాడు. వ్యక్తిగతంగా కొన్ని అప్పులు చేసి వాటిని తీర్చలేని పరిస్థితిలో ఉన్నానని పరిచయస్తుడైన పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ మాస్టర్ రామారావు వద్ద పలుమార్లు వాపోయాడు. కొంతకాలంగా అప్పుల బాధ తప్పుకునేందుకు పిడుగురాళ్లకు వచ్చి స్టేషన్ మాస్టర్ అయిన రామారావు రైల్వే క్వార్టర్స్‌లో తలదాచుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న అంజిబాబు పిడుగురాళ్లలో రైల్వేక్వార్టర్స్‌లో రామారావు వద్ద ఉన్నట్లు తెలుసుకున్న మాబుసుభాని మరికొంతమంది స్నేహితులతో కలిసి అంజిబాబు ఉంటున్న రైల్వే క్వార్టర్స్ వద్దకు వచ్చి మాట్లాడుకుందాం రమ్మని అంజిబాబుతో పాటు గవన్ కుమార్‌రెడ్డిని తీసుకొని కారులో హైవేపై ఉన్న ఖలీల్ దాబా ఎదురుగా ఉన్న ప్లాట్ల వద్దకు వెళ్లారు. అక్కడ అప్పు చెల్లించాలని అంజిబాబుతో మాబుసుభాని గొడవపడి ఇద్దరూ చేతులతో కొట్టుకున్నారు. బాకీ చెల్లించేందుకు అంజిబాబు కొందరిని ఫోన్‌లో డబ్బులు అడుగగా డబ్బులు లేవని తెలుపడంతో మనస్తాపానికి గురై ఖలీల్ దాబా వద్ద ఉన్న ప్లాట్ల నుంచి పిల్లుట్ల శివారులోని నాగేశ్వరపురంతండాలోని వ్యవసాయ పొలాల్లోకి వెళ్లారు. అక్కడ సాయంత్రం 7 గంటల వరకు బాకీ చెల్లించాలనే విషయంలో వాగ్వివాదం జరిగి బాకీ చెల్లించలేకపోతే చావమని రెచ్చగొట్టారు. గడ్డిముందు తెచ్చిస్తే తాగి చనిపోతానని అంజిబాబు తెలుపగా మాబుసుభాని తనతోపాటు వచ్చిన వ్యక్తులతో గడ్డిమందు డబ్బా కొనితెచ్చిచ్చారు. అంజిబాబు గడ్డిమందును మద్యంలో కలిపి తాగగా మాబుసుభానితోపాటు వచ్చిన మరికొందరు పారిపోగా అంజిబాబు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు వచ్చి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స పొందుతూ గుంటూరులోని రమేష్ హాస్పటల్‌లో మృతి చెందినట్లు సీఐ ఎస్ వెంకట్రావు తెలిపారు. గవన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడి అరెస్టు

● 120 గ్రాముల బంగారం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆరు నెలల్లో తాడేపల్లిలో జరిగిన వరుస చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ కల్యాణ్‌రాజు వివరాలు వెల్లడించారు. సీఐ కల్యాణ్‌రాజు, ఎస్‌ఐ ఖాజావలి సిబ్బందితో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో విశ్వసనీయ వర్గాల వారి సహకారంతో పక్కా సమాచారం సేకరించి నిందితుడిని గుర్తించారు. ఈ క్రమంలో తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి వద్ద కాపుకాసి స్కూటీపై వెళుతున్న శీలం కమల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరికి చెందిన కమల్ పగటి వేళల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని మెడలో ఉన్న బంగారు చైన్లు దొంగతనం చేసి పారిపోతున్నట్లు అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు. తాడేపల్లిలో నమోదైన మూడు కేసులకు సంబంధించి సుమారు రూ.10లక్షల విలువైన 120 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ కల్యాణ్‌రాజు, ఎస్‌ఐ ఖాజావలి, సిబ్బంది సురేశ్, ప్రసాద్, పరమేష్‌లను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

ఆలపాటికి నాని, పంచుమర్తి అభినందనలు




గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు- కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం పొందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి టీడీపీ గుంటూరు జిల్లా సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు, కోవెలమూడి రవీంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కసుకుర్తి హనుమంతరావు, పానకాల వెంకట మహాలక్ష్మి, ఉప్పుటూరి పేరయ్య, వినోద్, వెంకటేశ్వరరావు, నలబోతు శ్రీనివాసరావు, అడపా శివప్రసాద్ బాబు, పాములపాటి శ్రీనివాసరావు, పుల్లా సుందరం బాబు తదితరులు ఉన్నారు.

జగన్‌కు విమర్శించే అర్హత లేదు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవడంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత జగన్‌మోహన్‌రెడ్డికి లేదన్నారు. కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకి తక్కువ అంటూ మాట్లాడటం తగదన్నారు. ఇలాంటి అహంకార మాటలకే 11 స్థానాలకు దిగజారారని అన్నారు. సొంత చెల్లి, తల్లి, కార్యకర్తలే అతన్ని నమ్మడం లేదన్నారు. ఎమ్మెల్సీ బ్యాలెట్ ఎన్నికలలో కూడా 67 శాతం ఓట్లు కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాదు, రాజశేఖర్‌కు ప్రజలు వేశారన్నారు. ఈవీఎం, బ్యాలెట్ పద్ధతులలో ఏ ఎన్నికలైనా గెలుపు మాత్రం కూటమి పార్టీలదే అన్నారు. గత ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి కంటే పవన్‌కల్యాణ్‌కు వచ్చిన మెజార్టీ, వైసీపీ, జనసేనకు వచ్చిన సీట్లు ఎన్నో జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచించుకోవాలన్నారు. మంచి ప్రవర్తనతో వ్యవహరిస్తే బాగుంటుందన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సమయం చూసి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాడికొండలోని జనరల్, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ విద్యార్థినుల కోసం, జనరల్ బాలుర కోసం రెండు గురుకులాలు ఉన్నాయని తెలిపారు. ఆయా గురుకులాల్లో 5వ తరగతితోపాటు 6,7,8 తరగతుల్లో ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఈ నెల 31లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 8712625038లో లేదా https://aprs.ap.cfss.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల, మార్చి 5 (ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెంలో గల పీఎం ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశించే విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా శాఖ అధికారులు పి. హవీలా, డి.బ్రహ్మేశ్వరరావు బుధవారం తెలిపారు. పరీక్ష కోసం కనీస వయస్సు ఓసీ, బీసీ విద్యార్థులకు పది నుంచి 12 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 14 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. 2024-25 సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 5వ తరగతి చదివి ప్రమోషన్ పొందిన వారై ఉండాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీన పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షకు కనీస ఉత్తీర్ణత ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులని తెలిపారు. పరీక్షల్లో కనబరిచిన ప్రతిభా మార్కులు, రిజర్వేషన్ నియమాలను అనుసరించి ఎంపిక చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

తెనాలి క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పట్టణంలోని ఇస్లాంపేట పాలపర్తి వారి వీధిలో జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి మున్సిపాలిటీలో దినసరి కూలీగా పని చేస్తున్న యర్రంశెట్టి సాయికల్యాణ్ (27)కు నాలుగు సంవత్సరాల క్రితం బాపట్లకు చెందిన దుర్గాభవానీతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు. ఇరు కుటుంబాలలో ఏర్పడిన చిన్నపాటి గొడవలు కారణంగా భార్య సంవత్సర క్రితం పుట్టింటికి వెళ్లింది. గత నెలలో తిరిగి కాపురానికి తెనాలి వచ్చింది. ఆ సమయంలో కూడా భర్త సరిగ్గా ప్రవర్తించకపోవడంతో తిరిగి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి బాపట్లలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కొద్దిరోజుల క్రితం బాపట్ల పోలీసులు సాయికల్యాణ్‌కి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. బుధవారం ఉదయం ఇంటిలో సాయికల్యాణ్ ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుని మరణించి ఉండటం తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు చేసుకుని విచారిస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

కారంపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని నరమాలపాడు శివారులో బుధవారం జరిగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చింతలవూరు గ్రామానికి చెందిన తాడి సత్తిబాబు (40) వినుకొండ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు సుబాబులు చెట్లు నరికేందుకు ట్రాక్టర్‌లో వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని నరమాలపాడు శివారులో ట్రాక్టర్ అదుపుతప్పడంతో సత్తిబాబు ట్రాక్టర్ కింద పడిపోయాడు. ట్రాక్టర్ టైరు అతనిపైకి ఎక్కడంతో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వాసు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 526.50 అడుగులు ఉంది. ఇది 161.39 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8718 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,821 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

1,30,346 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,18,446 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,30,346 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,217 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	13000
334	9500	13700	బ్యాడిగి 355	10500	13500
నంబరు. 5	10500	13500	సింజెంటా		
273	10000	13000	బ్యాడిగి 5531	10500	12500
341	10500	14600	ఎస్ఎస్ 250		
4884	10000	10700	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	12500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11500
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

కూటమి ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనమే ఆలపాటి ఘన విజయం


ఆలపాటికి పూలబొకే అందజేసి అభినందనలు తెలుపుతున్న వేగుంట రాణి, ఇతర టీడీపీ నాయకులు

క్రోసూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలల కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమే ఆలపాటి రాజేంద్రప్రసాదు ఘన విజయం అని తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో క్రోసూరు మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆలపాటిని కలసి పూలబొకేలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వేగుంట రాణి మాట్లాడుతూ చట్టసభల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, యువతకు మంచి భవిష్యత్, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఆలపాటి కృషి చేస్తారన్న నమ్మకంతో ఆయనను భారీ మెజార్టీతో పట్టభద్రులు గెలిపించారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో కూడా ఆలపాటికి మంచి మెజార్టీ లభించిందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆమె రాజా దృష్టికి తెచ్చినట్టు తెలిపారు. ఆయనను అభినందించిన వారిలో టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, శాఖమూరి శ్రీనివాసరావు, బి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం: ఎస్పీ

పిడుగురాళ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై పిడుగురాళ్ల, దాచేపల్లి పట్టణాలలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో ప్రధాన రహదారులపై తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలు రోడ్డుపై విచ్చలవిడిగా పెట్టకుండా క్రమపద్ధతిలో నిర్దేశించిన ప్రాంతాలలో వాహనాలు పెట్టుకునేలా పోలీసులకు తగు సూచనలు ఇచ్చామన్నారు.

9న ప్రతిభా పరీక్షలు

పిడుగురాళ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా స్థాయిలో పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాంసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో స్కాలర్‌షిప్ ప్రతిభాపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రతినిధి బీవీ రమణ తెలిపారు. బ్రాహ్మణపల్లి జడ్పీ పాఠశాలలో ఈమేరకు వివరాలను వెల్లడించారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలతో పాటు పలు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామని, 7, 8, 9 తరగతుల విద్యార్థులు ఒక జట్టుగా ప్రతి పాఠశాల నుండి పాల్గొనవచ్చన్నారు. మొదటి మూడు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు రెండు సంవత్సరాలు ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తామని రమణ తెలిపారు. వివరాలకు బీవీ రమణ, 99662 23714, బాజీఖాన్, 99496 14674ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం హనుమత్‌శాస్త్రి పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన

దాచేపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రైతు విశిష్ట సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కల్పించినట్టు వ్యవసాయశాఖ అధికారి పాపకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని రామాపురం, పొందుగుల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలు, పీఎం కిసాన్ పంట రుణాలపై వడ్డీ రాయితీ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, రాయితీపై యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్య పరికరాలు అందుతాయని వివరించారు. రైతుసేవా కేంద్రాల్లో విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకొనేందుకు కావాల్సిన వివరాలు, పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్, ఆధార్ లింకైన ఫోన్‌తో రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు సంఖ్యను పొందాలని కోరారు. కంది వేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పంటలను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. కంది మద్దతు ధర రూ.7,500కు అమ్ముకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాచవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. మాచవరం ఎస్‌ఐ సతీష్ కథనం మేరకు.. మోర్జంపాడు గ్రామానికి చెందిన కట్టెబోయిన నరసింహారావు(60) గత కొంతకాలంగా నడుంనొప్పితో బాధపడుతున్నాడు. ఈనెల 3వ తేదీన జీరా బాటిల్‌లో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. గమనించిన బంధువులు నరసరావుపేటలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు తెలిపారు. భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేయడం లేదని మహిళ ఆత్మహత్యాయత్నం

పిడుగురాళ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జానపాడు గ్రామానికి చెందిన కమ్మసాని మంగమ్మ అనే మహిళ పిడుగురాళ్లకు చెందిన అల్లూరి పరమేశ్వరరావుకు మూడు సంవత్సరాల క్రితం ఇల్లు తాకట్టు రిజిస్ట్రేషన్ చేసి రూ.7లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పటినుండి ఇప్పటివరకు ప్రతి నెలా వడ్డీ చెల్లించుకుంటూ అసలు బాకీలో రూ.7లక్షలలో రూ3లక్షలు చెల్లించింది. అనంతరం మిగిలిన రూ.4లక్షలు, వడ్డీ చెల్లిస్తాను.. తన ఇల్లు తిరిగి రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా అందుకు పరమేశ్వరరావు ఒప్పుకోకుండా నీ ఇష్టం వచ్చింది చేసుకోమని చెప్పాడు. మనస్థాపానికి గురైన మంగమ్మ బుధవారం సాయంత్రం పరమేశ్వరరావు ఇంటివద్ద తన వెంట తెచ్చుకున్న కిరోసిన్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. సమాచారం అందుకున్న ఎస్సై మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని మంగమ్మ ఆత్మహత్యాయత్నాన్ని తప్పించటంతో పాటు పరమేశ్వరరావును పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 30.89 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. మూడు వందల క్యూసెక్కుల నీరు కృష్ణానదికి విడుదల అవుతున్నాయి.

ఘనంగా మాజీ మంత్రి డొక్కా జన్మదిన వేడుకలు

గురజాలటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని వీఎంఏఎస్ క్లబ్‌లో డొక్కా మిత్రమండలి సభ్యుడు బంకా జయనాన్‌కుమార్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పోటు నాగేశ్వరరావు, కలకండ ఆంధ్రయ్య, కత్తి చలమరాజు, వైద్యులు సుధీర్‌బాబు, కర్ణ సాయికుమార్, వాసు, నాగేశ్వరరావు, ప్రసాద్, రామ్మూర్తి, రామారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, దత్తు తదితరుల పాల్గొన్నారు.

న్యూటన్స్ విద్యార్థుల ప్రతిభ

మాచర్ల రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన టెక్‌ఫెస్ట్‌లో మాచర్ల పట్టణంలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో జేఎన్‌టీయూ పరిధిలో రెండో బహుమతి సాధించారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం కళాశాలలో సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, సిబ్బంది అభినందించారు.

భద్రత జీవితంలో భాగం కావాలి

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.పరమేశ్వరరావు

రెంటచింతల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భద్రత జీవితంలో ఓ భాగం కావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏర్పడే ఇబ్బందులను ఊహించడం కష్టంగా ఉంటుందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.పరమేశ్వరరావు సూచించారు. బుధవారం పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమానికి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అధ్యక్షత వహించారు. కార్మికులు, ఉద్యోగులనుద్దేశించి పరమేశ్వరరావు ప్రసంగిస్తూ పని ప్రదేశంలో బలమైన భద్రతా చర్యల కల్పనకు యాజమాన్యాలు గట్టిగా కృషిచేయాలని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు మాట్లాడుతూ సురక్షితమైన ఆరోగ్యకరమైన పని వాతావరణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భద్రతకు సంబంధించి స్కిట్‌ను కార్మికులు ప్రదర్శించారు. వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో డీజీఎంలు గణపతిరాజు, వెంకట్రావ్, మల్లికార్జున, జీఎం చంద్రశేఖర్, సేఫ్టీ మేనేజర్ జగదీష్‌రెడ్డి, వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న కె.పరమేశ్వరరావు

కోట్లు ఖర్చు చేశారు... ఖాళీగా ఉంచారు

● అలంకారప్రాయంగా మారిన పులిచింతల పునరావాస కేంద్ర భవనాలు
● అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం



రాజుపాలెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కోట్లు ఖర్చు చేసి అన్ని సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించారు. సంవత్సరాలు గడుస్తున్నా ఖాళీగానే ఉంచారు. ఒక్కొక్క పునరావాస కేంద్రంలో ఐదు నుండి ఆరు భవనాలను నిర్మించి నేటికీ ఖాళీగానే ఉంచారు. 2004లో కాంగ్రెస్ పార్టీ హయాంలో పులిచింతల ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తన నియోజకవర్గంలోని రాజుపాలెం మండలంలో రాజుపాలెం, రెడ్డిగూడెం, కొత్తబోధనం, చౌటపాపాయపాలెం గ్రామాలలో పులిచింతల నిర్వాసితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. విశాలమైన రోడ్లు, పక్కా గృహ నిర్మాణాలు ఆయా గ్రామాలలో నిర్మించారు. ఆయా కేంద్రాలలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, గ్రంథాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, పశు వైద్యశాలలు, కమ్యూనిటీ హాల్స్ వంటి ఏడు రకాల ప్రభుత్వ భవనాలను నిర్మించింది. వాటిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మిగిలిన అన్ని భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

మందుబాబులు, విష సర్పాలకు ఆలవాలం..

పులిచింతల పునరావాస కేంద్రాలలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఖాళీగావుండటంతో వాటిలో మందుబాబులు మద్యం తాగుతున్నారు. భవనాలు ఉపయోగంలో లేకపోవటంతో పిచ్చిచెట్లుపెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో పరిసరాల్లో ఉండే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పొద్దుపోయిన తర్వాత మహిళలు వెళ్లాలంటే భయపడుతున్నారు.


కొత్తబోధనంలో నిర్మించిన వ్యాపార సముదాయం

రైతులకు గిడ్డంగులుగానైనా ఉపయోగించాలి

చిమట సైదారావు, మాజీ సర్పంచ్, బోధనం



రాజుపాలెం కేంద్రంగా నిర్మించనున్న మార్కెట్‌యార్డు నిర్మాణం పూర్తయ్యేవరకు పునరావాస కేంద్రాలలో ఖాళీగాఉన్న భవనాలను కార్యాలయాలు, గిడ్డంగులుగానైనా ఉపయోగించుకోవాలి. రాజుపాలెంలో మార్కెట్‌యార్డు కార్యాలయం, సత్తెనపల్లి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యాలయాలు ప్రైవేటు భవనాలలో నిర్వహిస్తున్నారు. వాటిని ఖాళీగా ఉన్న భవనాల్లో తరలించాలి.


ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు

ఆలపాటికి టీడీపీ నాయకుల సన్మానం

ముప్పాళ్ళ, మార్చి 5(ఆద్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అఖండ మెజారిటీతో గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబులు ఆయన కార్యాలయంలో కలిసి గజమాలతో సన్మానించారు. వారివెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న టిప్పర్

● పదిమంది వ్యవసాయ కూలీలకు గాయాలు

కారంపూడి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను టిప్పర్ వెనుకగా ఢీకొనడంతో పదిమంది కూలీలకు గాయాలైన సంఘటన మండలంలోని నరమాలపాడు శివారులో బుధవారం జరిగింది. మిరియాల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మిర్చి కోతలకు నరమాలపాడుకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. నరమాలపాడు గ్రామ శివారులోకి రాగానే వెనుకగా ఇసుక లోడుతో వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ సంఘటనలో పదిమంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో కొందరిని గురజాల పట్టణంలోని వైద్యశాలకు, మరికొందరిని నరసరావుపేటకు తరలించారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మవరం చెరువులో అక్రమంగా మట్టి తవ్వకం

● ఒకరి అరెస్టు.. పొక్లెయినర్ సీజ్

దుర్గి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం చెరువులో మంగళవారం రాత్రి తోట ప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా మట్టి తవ్వకానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఫణీంద్రకుమార్ చెరువు వద్దకు చేరుకొని పనులను నిలిపివేయించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పొక్లెయినర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిచారు.

దాడి కేసులో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసుల నమోదు

మాచర్ల రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న కేసులో రూరల్ పోలీసులు ఇరువర్గాలపై బుధవారం హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. మండలంలోని జమ్మలమడక గ్రామానికి చెందిన కొండా శివలింగం, కామనబోయిన చంద్రయ్యల మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఇరువర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ జగదీష్, మాచర్ల పట్టణ సీఐ ప్రభాకరరావులు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పి శాంతింపజేశారు. శివలింగం, చంద్రయ్యల ఫిర్యాదు మేరకు ఒక్కో వర్గంలో పదిమంది చొప్పున 20మందిపై బుధవారం హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్లు మాచర్ల రూరల్ ఎస్‌ఐ రవిబాబు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి నేడు శంకుస్థాపన

పెదకూరపాడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని గారపాడులో ఈనెల 6వ తేదీ గురువారం ఉదయం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థాన నిర్మాణానికి భూమి పూజ జరుగుతుందని నిర్మాణ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఉదయం 9:43 గంటలకు ఈ శంకుస్థాపన మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగులకు అభినందన

సత్తెనపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ విజయకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ జరిగింది. ఫిబ్రవరి నెలలో డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పీఎస్ నారాయణ, ఎస్‌కేఎం సుభానీ, కండక్టర్లు పీకే రావు, సీహెచ్ కోటయ్య, ఎస్ కోటిరెడ్డిలను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ డిపోలోని డ్రైవర్లు, కండక్టర్లు వీరిని ఆదర్శంగా తీసుకొని అత్యధిక కేఎంపీఎల్, ఈపీకేలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ విజయకుమార్

పవన్‌కల్యాణ్‌ను విమర్శించేస్థాయి జగన్‌రెడ్డికి లేదు

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అంకారావు

గురజాలటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించేస్థాయి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లేదని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని బుధవారం ఆయన డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు అభినందన

క్రోసూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన క్రోసూరు మండలం బాలెమర్రు ప్రాథమిక పాఠశాల విద్యార్థులను బుధవారం ఎంఈవో ఏకుల ప్రసాదరావు అభినందించారు. వారికి స్వీట్లు తినిపించి భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. పాఠశాల విద్యార్థులు కే సాంబశివరావు, కే రాకేష్ నరసరావుపేటలో జరిగిన క్విజ్‌పోటీల్లో ప్రథమస్థానం సాధించారు. మారుమూల గ్రామం నుంచి ఈ ఇరువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచటం అభినందనీయమని మరో ఎంఈవో గణేష్ అన్నారు. హెచ్‌ఎం శరత్‌కుమార్, వెంకటేశ్వరరావులను అధికారులు అభినందించారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

క్రోసూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో బుధవారం అనారోగ్య కారణాలతో మృతిచెందిన టీడీపీ నాయకుడు సయ్యద్ దరియావలి మృతికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఆయన దరియావళి మరణవార్త తెలుసుకొని కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుల ద్వారా మట్టి ఖర్చులకు ఆర్థికసాయం అందించారు. మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేసినవారిలో స్థానిక టీడీపీ నాయకులు మొగల్ జాన్, దాచేపల్లి చందు, శివనాగేశ్వరరావు, దాచేపల్లి సైదా, శాంతయ్య, చింతపల్లి బాజీ తదితరులు ఉన్నారు.

గ్రామ సాధికార సర్వే సభ్యులను నియమించాలి

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య


నకరికల్లు టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగోతు శౌరయ్య

నకరికల్లు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ సాధికార సర్వే సభ్యులను నియమించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య అన్నారు. బుధవారం నకరికల్లు టీడీపీ కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో శౌరయ్య మాట్లాడుతూ ప్రతి 30 ఓటర్లకు సాధికార సర్వే సభ్యులను నియమించాలన్నారు. గ్రామంలో ఉన్న ఓటరు జాబితా ఆధారంగా గ్రామ పార్టీ అధ్యక్షులకు అందజేశారు. ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి టీడీపీ కార్యకర్తకు తోడుగా మేముంటామని శౌరయ్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజుపాలెం మండల పరిశీలకులు సాగి శ్రీనివాసరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు అహమ్మద్ బుడే, జనసేన మండల అధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు దూదేకుల హుస్సేన్‌బీ, తిరుమలశెట్టి వెంకటరావు, కాశీ విశ్వనాథం, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జల్లాపేట వంతెన


రెయిలింగ్ పడిపోయి ప్రమాదకరంగా ఉన్న జల్లాపేట బ్రిడ్జి

నకరికల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడి కాలువపై జల్లాపేట వెళ్ళేమార్గంలో ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రెయిలింగ్ పడిపోయింది. బ్రిడ్జి పైన గుంతలు ఏర్పడ్డాయి. సాగర్ నిర్మాణ సమయంలో జల్లాపేట తండా వెళ్ళేందుకు సాగర్ కాలువ అవతల వైపునకు వెళ్ళేందుకు ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఆ తరువాత ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో సైడువాల్స్ కొన్నిచోట్ల పడిపోయి ఉన్నాయి. ఎదురుగా వాహనం వస్తే తప్పుకునే అవకాశం ఉండదు. చిన్న వాహనాలు మినహా పెద్ద వాహనాలు వెళ్ళే అవకాశం లేదు. ఏ మాత్రం అదుపు తప్పినా కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బ్రిడ్జి స్థానంలో వెడల్పుగా కొత్త బ్రిడ్జిని నిర్మించాలని జల్లాపేట తండా వాసులు కోరుతున్నారు.

క్రోసూరులో 12న ఆంజనేయ స్వామి విగ్రహం ఆవిష్కరణ

క్రోసూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో సుమారు రూ 40 లక్షల వ్యయంతో నిర్మించిన 33 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఈనెల 12న ఆవిష్కరించనున్నట్టు విగ్రహ కమిటీ ప్రతినిధి కర్నాటి కృష్ణారావు తెలియజేశారు. క్రోసూరుకు దక్షిణ భాగాన చెరువు కట్టపై అభయాంజనేయస్వామి రూపంలో విగ్రహాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. 12న తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ జరుగుతుందని, ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు పాటించాలి

● శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్

కారంపూడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను నివారించాలంటే భద్రతా చర్యలు పాటించాలని శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఫ్యాక్టరీలో జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కార్మికులచే ప్రతిజ్ఞ చేయిచారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పరమేశ్వరరావు, రాంబాబు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



వారోత్సవాల్లో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి


అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. వెలగపూడిలో బుధవారం జరిగిన శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో రహదారులు బాగుంటేనే రాష్ట్ర అభివృద్ధికి బేరీజు వేసే పరిస్థితి ఉందని, కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి రూ.8వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించటం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొంతమేరకు నిధులను కేటాయించి రోడ్ల మరమ్మతులు చేయించటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రహదారుల అభివృద్ధికి భవిష్యత్‌లో ప్రభుత్వం అధికమొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 110 కిలోమీటర్ల మేర రహదారులు బలహీన పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో వాటి నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సత్తెనపల్లిలో పెరిగిపోతున్న వడ్డీ వ్యాపారుల ఆగడాలు

సత్తెనపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజుకు రోజుకు పెరిగి పోతున్నాయని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లిలో వడ్డీ వ్యాపారిపై గతంలో తాను ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో వడ్డీ వ్యాపారులు చెలరేగి పోతున్నారన్నారు. ఇటీవల వడ్డీ వ్యాపారులు తమ వద్ద వడ్డీకి డబ్బులు తీసుకున్న ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి దారుణంగా హింసించారన్నారు. మరో వ్యక్తిని కొట్టి పురుగుల మందు తాపటంతో అతను చనిపోయాడన్నారు. ఇప్పటికైనా పోలీసులు ఉదాసీన వైఖరిని విడనాడి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు మరలా జరగకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

11 సీట్లకే పరిమితమైనా జగన్ ధోరణిలో రాని మార్పు

రాజుపాలెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ అధినేత జగన్ ధోరణిలో మార్పు రాలేదని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట నరసయ్య అన్నారు. బుధవారం రాజుపాలెం మండల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పవన్‌కల్యాణ్‌ను అనరాని మాటలు అనిపించినందుకు తమ నాయకుడు బహిరంగసభలో మీ పార్టీని అథఃపాతాళానికి తొక్కుతానని హెచ్చరించి మరీ తొక్కి చూపించాడన్నారు. సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నారపుశెట్టి కోటేశ్వరరావు, బత్తుల హనుమంతురావు, చెవుల ఆంజనేయులు, రుసుం వేంకటేశ్వర్లు, పసుపులేటి వేంకటేశ్వర్లు, కేదారి రమేష్, పరిమి శ్రీనివాసరావు, పగడాల నరసింహరావు, తోట లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

9 నుంచి జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు

రాజుపాలెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో ఈ నెల 8వ తేదీ నుంచి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి 96వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని 9వ తేదీ నుండి 12 వరకు జాతీయస్థాయి ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మన్నెం శివనాగమల్లేశ్వరరావు తదితరులు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 99637 11877, 97019 72199లో సంప్రదించాలని కోరారు.

మహిళల భాగస్వామ్యంతోనే సమాజ అభివృద్ధి

● ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత

నకరికల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల భాగస్వామ్యంతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సత్తెనపల్లి సీడీపీవో శ్రీలత అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఉత్తమ మహిళా పోలీసు రషీదా, ఉత్తమ ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపీ లక్ష్మి, పద్మావతి, మాణిక్యంలను ఘనంగా సత్కరించారు. మహిళాదిన వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సంతోష్‌కుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


జీడిమామిడి కాయలు




జీడిమామిడి చెట్లకు పూసిన పూత, పిందె

❖ ఆశాజనకంగా పంట ❖ శాస్త్రవేత్తల సూచనలతో అధిక దిగుబడులకు అవకాశం

జీడి పండు.. పూత మెండు!


బాపట్ల పరిశోధనా స్థానంలో జీడిమామిడిచెట్లు

బాపట్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అత్యధిక పోషక విలువలు కలిగి ఉండటమే కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న జీడిమామిడి పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. సకాలంలో పూత, పిందె వచ్చింది. మంచు కూడా తగ్గుముఖం పట్టడంతో పూత, పిందె నిలబడి కాయ కాస్తుంది. దీంతో ఈ ఏడాది ఆశించిన దానికంటే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం వారు 1955 నుంచి ఇక్కడ మేలు రకాల జీడిమామిడి రకాలను రూపొందిస్తున్నారు. అఖిల భారత సమన్వయ జీడిమామిడి పరిశోధన పథకం కింద 60 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు పెంచి కొత్త వైరటీలను రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు 10 రకాల జీడిమామిడి మొక్కలను తయారు చేశారు. అందులో బీపీపీ-7 మినహా బీపీపీ-1 నుంచి బీపీపీ-11 వరకు ఈ రకాలను ఆధునికీకరించారు. వీటిల్లో బీపీపీ-8,9 రకాలు అధిక దిగుబడులు ఇస్తున్నాయి. ఒక్కొక్క చెట్టు నుంచి 15 నుంచి 20 కేజీల గింజలు వస్తున్నాయి. కిలో గింజలు రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతుంది. 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీడిమామిడి చెట్లను ప్రతి ఏడాది వేలంపాట ద్వారా రైతులకు ఇస్తుంటారు. గత ఏడాది రూ. 7.75 లక్షల ఆదాయం వచ్చినట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు తెలిపారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం జీడిమామిడి చెట్లలో ఆకు ముడత, ఆకుకత్తెరించే పురుగు, గూడు కట్టుట వంటివి ఆశిస్తున్నట్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున కలిపి అందులో 19-19-19 రకం 5 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకొని నివారించుకోవాలని సూచించారు. పిందె దశలో ఉన్న తోటల్లో చెట్టుకు 200 లీటర్ల నీటిని అందిస్తే పిందెశాతం పెరిగి అధిక దిగుబడికి దోహదం పడుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1.32 లక్షల హెక్టార్లల్లో జీడిమామిడి సాగు చేస్తున్నారు. వీటి ద్వారా లక్షా 20 వేల మెట్రిక్‌టన్నుల జీడిగింజలు ఉత్పత్తి అవుతున్నాయి. రైతులు సెప్టెంబరు, అక్టోబరు నెలలో ఎరువు అందించకపోతే పూత, పిందె దశలో 19-19-19 రకం ఎరువును లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పూత, పిందె, కాయ దశలో పిచికారి చేసుకొని దిగుబడులు సాధించవచ్చు. ఇక్కడ పెంచిన మొక్కలకు అంటుకట్టి రైతులకు జూన్ నెల నుంచి విక్రయిస్తామని శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రతి ఏడాది 40 వేల మొక్కలు ఒక్కొక్కటి రూ. 50 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

జీడిపండు నుంచి పొడర్ తయారీ

-శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు



జీడిగింజలే కాకుండా జీడిపండురసం నుంచి పౌడర్ తయారు చేసి ఏడాదిలో ఎప్పుడైన జ్యూస్‌గా కలుపుకొని తాగవచ్చు. జీడిపండు రసం ఎక్కువ రోజులు నిల్వ ఉండదు కనుక దీనిని అభివృద్ధి చేశాం. దీనికి పెటెంట్‌కు కూడా రానుంది. ఇప్పటికే పబ్లిష్ అయింది. ఇండియన్ పెటెంట్ కార్యాలయంలో పెటెంట్ జర్నల్స్‌లో ప్రచురించారు. పూర్తిగా గ్రాంట్ అవ్వాల్సి ఉంది. ఇది పూర్తి చేస్తే జీడి గింజలతోపాటు జీడిపండుకు కూడా డిమాండ్ వచ్చే అవకాశం ఉంది.


రైతులకు విక్రయించేందుకు శాస్త్రవేత్తలు పెంచుతున్న జీడిమామిడి మొక్కలు

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలం లేమల్లె గ్రామపరిధిలో జరిగే హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే 48వ గుడారాల పండుగకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ పండుగకు బుధవారానికే వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా విశ్వాసులు తరలివచ్చారు. దీంతో లేమల్లె ప్రాంగణంలోని దయాక్షేత్రం కిటకిటలాడింది. గుడారాల పండుగ ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం దయాక్షేత్రంలో నూతనంగా నిర్మించిన హోసన్న మందిరాన్ని ప్రారంభించారు. చెన్నైకు చెందిన పాస్టర్ మోహన్‌సీ లాజరస్, హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ అనిల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సౌత్‌ఆఫ్రికాకు చెందిన జాషువా మోజస్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. జాన్‌వెస్లీ తదితరులు గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రమేష్, రాజు, ఫైడిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గుడారాల పండుగ

దయాక్షేత్రానికి వేలాదిగా తరలివచ్చిన విశ్వాసులు

లేమల్లె ప్రాంగణంలో హోసన్న మందిరం ప్రారంభం


హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహంతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రత్యేక బందోబస్తు : ఎస్పీ శ్రీనివాసరావు

గురువారం నుంచి లేమల్లె గ్రామపరిధిలో జరిగే గుడారాల పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన దయాక్షేత్రం ప్రాంగణాన్ని సందర్శించి పండుగకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. స్టేజీలు, భోజనశాలలను పరిశీలించి హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్‌పాస్టర్ జాన్‌వెస్లీలతో పండుగ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవుని ప్రసంగాలతో పాటు విశ్వాసులలో సైబర్ నేరాల పై అవగాహన కలిగేలా సూచనలు ఇవ్వాలన్నారు. పండుగ జరిగే నాలుగు రోజులు ప్రాంగణంలో సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో పర్యవేక్షణ చేస్తామన్నారు. అమరావతి- గుంటూరు రహదారిలో లేమల్లె వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ హనుమంతరావు, సీఐ అచ్చయ్య, ఎస్ఐ అమీర్ తదితరులు ఉన్నారు.

గుడారాల పండుగకు 25 ప్రత్యేక బస్సులు

గుంటూరు: లేమల్లెలో నిర్వహిస్తున్న గుడారాల పండుగకు ఆర్టీసీ గుంటూరు-1 డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం ఎమ్‌వీఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచి రూ.30 చార్జీతో గుడారాల పండుగ ప్రాంగణానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విశ్వాసులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. పండుగ ముగిసే వరకు ప్రత్యేక బస్సులను అదనపు సిబ్బందితో అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవులకు నోటిఫికేషన్ వెలువడటంతో కూటమి పార్టీలోని ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 20న ఎన్నికలు జరగనున్నాయి. సునాయాసంగా దక్కే ఆ పదవులను దక్కించుకునే కూటమి నేతల్లో అదృష్టవంతులెవరనే దానిపై ఊహాగానాలు జోరందుకున్నాయి. జనసేనకు ఒకటి మినహాయిస్తే మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ పదవులను టీడీపీకే కేటాయించే ఉద్దేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. ఆ నాలుగింటిలో ఒక పదవి కీలకమైన ఉమ్మడి గుంటూరు జిల్లాకు దక్కే అవకాశం ఉంది. ఆ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు ఇచ్చే అవకాశం ఉందని ఇప్పటికే ఊహాగానాలు వెలువడ్డాయి. గత సాధారణ ఎన్నికల్లో తాను పోటీ చేయాల్సిన పెదకూరపాడు నియోజకవర్గాన్ని యువత కోటాలో భాష్యం ప్రవీణ్ పోటీ చేసే అవకాశం కల్పించి, ఆయన విజయానికి శ్రీధర్ పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పర్యటనలో చంద్రబాబు సభాముఖంగా కొమ్మాలపాటికి పదవిపై హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయనకు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. దీంతో శ్రీధర్ ఎమ్మెల్సీ పదవి రేసులో అందరికంటే ముందున్నారని చెప్పవచ్చు. గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ సీటును బీసీలకు ఇవ్వాలనే అధిష్ఠానం ఆలోచ నతో అప్పటి వరకు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తున్న కోవెలమూడి రవీంద్ర(నాని) సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవికి ఆయన పేరును కూడా అధిష్ఠానం పరిశీలించే అవకాశం ఉంది. అయితే నగరపాలక సంస్థలో టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరిస్తున్న నానికి త్వరలో కూటమి వశం కానున్న మేయర్ పీఠాన్ని కట్టబెట్టాలని యువనేత నారా లోకేశ్‌తో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా భావిస్తున్నారు. నానికి కూడా ఆ ఆలోచన ఉండటంతో ఏం జరుగుతుందో చూడాలి. గతంలో కూడా పార్టీ సుప్రీం చంద్రబాబునాయుడు కూడా ఒకటి రెండు సార్లు నానికి ఎమ్మెల్సీ ఇవ్వాలని ఆలోచన చేసినా చివరి నిమిషంలో సమీకరణలు మారి అవకాశం చేజారింది. ఈ పర్యాయం ఆయన మేయర్ పదవి వైపు అడుగులు వేస్తారో లేక ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తూ ఆశావహుల జాబితాలో నిలుస్తారో చూడాలి. ఇక రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాష్టారు కూడా ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తూ నాయకుల సిఫార్సులు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఎన్నికల సమయంలో వైసీపీ హయాంలో తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదులుకుని టీడీపీలో చేరిన గురజాల ప్రాంతానికి చెందిన జంగా కృష్ణమూర్తి పేరు కూడా పరిశీలన ఉన్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. అయితే ఆయనకు ఇప్పటికే ఎంతో కీలకమైన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా పదవిని కట్టబెట్టిన విషయం తెలిసిందే.

కొమ్మాలపాటిని.. ఎమ్మెల్సీ వరించేనా!

అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే పేరు

ఆశావహుల్లో జంగా సహా మరికొందరు నేతలు


కొమ్మాలపాటి శ్రీధర్


కోవెలమూడి నాని


జంగా కృష్ణమూర్తి

వైద్య వృత్తి ప్రమాణాలను పాటించండి!

● ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

● ఘనంగా కాటూరి వైద్య కళాశాల స్నాతకోత్సవం

గుంటూరు మెడికల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని సేవా నిరతితో నిర్వహిస్తామని, రోగులకు ప్రేమ, సానుభూతితో వైద్య సేవలు అందిస్తామని చేసే హిపోక్రాటిక్ ప్రమాణాలను వైద్యులు జీవితాంతం పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. చినకోండ్రుపాడులోని కాటూరి వైద్య కళాశాలలో బుధవారం రాత్రి జరిగిన 2019 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం 'సంవర్తన'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువ వైద్యులకు ఎంబీబీఎస్ పట్టా లను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడు తూ వైద్య వృత్తి క్రమేపీ వ్యాపారమయంగా మారుతున్నట్లు తెలిపారు. 'వైద్య వృత్తిలోకి ఏ స్ఫూర్తితో ప్రవేశించారో అదే స్ఫూర్తితో పేద రోగులకు వైద్య సేవలు అందించండి. చిరు నవ్వుతో రోగుల సమస్యలు వినండి, చక్కటి చికిత్సలు చేయండి. రోగుల ముఖంపై చిరునవ్వును ఆవిష్కరించండి' అంటూ సత్యకుమార్ కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు యువ వైద్యులు ఆసక్తి చూపడం లేదని మంత్రి తెలిపారు. "ఇటీవల మెడికల్ పీజీ విద్యార్థులకు డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్ కింద మూడు నెలల పాటు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసేందుకు పోస్టింగ్‌లు ఇచ్చాం. చాలా మంది పీజీలు తాము ఆయా ఆరోగ్య కేంద్రాల్లో పని చేయమని, తమ ప్రాంతంలో ఆసుపత్రిలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని నాపై పెద్దఎత్తున రాజకీయసిఫార్సులు తెస్తు న్నారు. ఈ సిఫార్సులను నేను ఆమోదించ లేదు. మూడు నెలల పాటు వైద్యులు గ్రామీణ ప్రాంతా ల్లో పని చేస్తే అక్కడి రోగుల ఇబ్బందులు తెలుస్తాయని" సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ కింద రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు త్వరలో ర్యాంకింగ్‌లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.



వైద్య పట్టాను ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రైవేటు వైద్య రంగానిది కీలక పాత్ర..

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే ప్రభుత్వ వైద్య రం గంతో పాటు ప్రైవేటు వైద్య రంగం భాగస్వామ్యం అవసర మని ఆరోగ్య శాఖ మాజీ మంత్రి, కైకలూరి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. వైద్యులు నిరంతరం విద్యార్థుల్లా ఉండాలన్నారు. రోగుల పట్ల సేవాభావంతో మెలగాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యా యని, ఇటువంటి పరిస్థితుల్లో వైద్య రంగం బలోపేతం చేసేందుకు మంత్రి సత్యకుమార్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని కామినేని తెలిపారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ చైర్మన్ కాటూరి సుబ్బారావు, జీఎస్ఎల్ గ్రూపు సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర రావు, డాక్టర్ మాదాల శ్రీనివాసరావు, కేఎంసీ డీన్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ఎండీ డాక్టర్ స్వైరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత విద్యుత్.. వెలుగులు



గుంటూరు (విద్య), మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ వెతలు తీరనున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు త్వరలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకు అయ్యే వ్యయం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.175 కోట్లు కేటాయించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలలు దాదాపు 4500పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6.45 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల్లో విద్యుత్ కీలకం. ప్రతి స్కూల్‌లో మరుగుదొడ్లకు అవసరమైన నీటి కోసం బోరు, మంచినీటి కోసం వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇంకా ప్రతి తరగతి గదిలో సగటున రెండు ఫ్యాన్లు, ట్యూబులైట్లు, డిజిటల్ ప్యానల్ బోర్డులు ఉన్నాయి. ప్రతి స్కూల్‌లోని ఆఫీసులో కంప్యూటర్స్ ప్రింటర్, జిరాక్స్ మిషన్ ఇలా అనేక విద్యుత్ ఉపకరణాలు ఉన్నాయి.


నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల

స్కూల్ గ్రాంట్ సక్రమంగా విడుదల చేయకపోవడంతో..

ప్రాథమిక పాఠశాలలకు సగటున నెలకు రూ.1000 నుంచి రూ.1500, ఉన్నత పాఠశాలలకు సగటున రూ.2 వేల నుంచి రూ.3 వేలపైన ప్రతి నెలా విద్యుత్ బిల్లు వస్తోంది. ఈ విద్యుత్ బిల్లు ఇప్పటి వరకు స్కూల్ గ్రాంట్ నుంచి చెల్లించేవారు. గత ప్రభుత్వ హయాంలో స్కూల్ గ్రాంట్ సక్రమంగా విడుదల చేయలేదు. దీంతో అనేక స్కూల్స్‌లో విద్యుత్ బిల్లులు వేలల్లో పెండింగ్ ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగా ఫీజులు తీసుకెళ్లడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రాంట్స్ విడుదల చేయడంతో విద్యుత్ బిల్లులు క్రమంగా చెల్లించుకుంటూ వస్తున్నారు. ఎన్నికల హామీలో భాగంగా పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించి బడ్జెట్‌తో నిధులు కేటాయించారు.

● ప్రాథమిక పాఠశాలకు రూ. 20 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.50 వేలు

● బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో హెచ్‌ఎంల హర్షం

ప్రధానోపాధ్యాయుల హర్షం

పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంపై ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతినెలా విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం తీవ్ర హైరానా పడాల్సి వచ్చేదని చెబుతున్నారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఫీజులు తీసుకెళ్లేవారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్కూల్ గ్రాంట్ నిధులు రావడంతో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, ఉచిత విద్యుత్ అమలు చేస్తే పాఠశాలలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ భారం నుంచి ఉపశమనం



పాఠశాలలకు ఉచిత విద్యుత్‌లో భాగంగా ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.50 వేలు వరకు ప్రభుత్వం చెల్లించనుంది. ఇందుకోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. త్వరలో అన్ని ప్రభుత్వ స్కూల్స్‌కు ఉచిత విద్యుత్ పథకం అమలు కానుంది.

-తిరుమలేష్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు

రైతులకు తీరని అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వం: జీవీ

వినుకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి రైతులకు తీరని అన్యాయం చేసిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీవీ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభమంటూ జగన్ ప్రభుత్వం రైతులను మోసం చేయడం దుర్మార్గమన్నారు. నదుల అనుసంధానంతో రాష్ట్రమంతా సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. బొల్లాపల్లి రిజర్వాయర్‌తో పాటు వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తి చేయాలని జీవీ ఆంజనేయులు అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రతి రోజూ నీటి సరఫరాకు ఏర్పాట్లు

చిలకలూరిపేట ప్రజలకు తీరనున్న దాహార్తి



నేషనల్ హైవే పక్కన పైపులైన్లు, చౌత్రా సెంటర్‌లో భారీ లీకులను సరిచేస్తున్న సిబ్బంది

చిలకలూరిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా తొలగిపోనుంది. ఇందుకోసం శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తీసుకున్న చొరవతో మునిసిపల్, ప్రజారోగ్య శాఖ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సంయుక్తంగా కృషిచేసి పరిష్కారం కనుగొన్నారు. ఏప్రిల్ 15 నుంచి పట్టణ ప్రజలకు ప్రతిరోజూ నీటిసరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు పెద్ద తాగునీటి చెరువులు ఉన్నపటికీ అనేక సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలకు రోజు మార్చి రోజు మాత్రమే నీటి సరఫరా జరుగుతున్నది. ప్రతిరోజు నీటిసరఫరా కోసం పట్టణాన్ని ఎనిమిది జోన్లుగా విభజించారు. ఎక్కడికక్కడ పైపులైనలను అనుసంధానించి రోజూ నీటిసరఫరా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడక్కడ పైప్‌లైన్ల లీకేజీ జరుగుతున్నది. వాటికి వెంట వెంటనే మరమ్మతులు చేస్తున్నారు. చౌత్రా సెంటర్, గాంధీ పార్కు, నేషనల్ హైవేకి ఇరువైపులా పైపులైన్లకు ఏర్పడిన భారీ లీకులను ఇప్పటికే పూడ్చివేశారు. ప్రతిరోజు నీటిసరఫరా కోసం ప్రజారోగ్య శాఖ ఈఈ జి.వెంకటేశ్వరరావు, మునిసిపల్ డీఈఈ అబ్దుల్ రహీమ్ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు. పైప్‌లైన్ల లీకేజీలకు గురైతే వెంటనే మునిసిపల్ కార్యాలయంలో తెలియజేయాలని డీఈఈ అబ్దుల్ రహీమ్ కోరారు. కాగా పట్టణంలో 16,475 అధికారిక కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆదేశాల మేరకు అనధికార కుళాయి కనెక్షన్లను గుర్తించేందుకు సిబ్బంది సర్వే చేస్తున్నారు. బుధవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించిన మున్సిపల్ ఆర్డీ హరికృష్ణ ప్రతిరోజూ నీటి సరఫరా జరపడానికి సమాయత్తం కావాలని, ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని ఆదేశించారు. లీకులను సరిచేయాలని, నీటి వృధాను తగ్గించాలని కోరారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలు గైకొంటున్నట్టు కమిషనర్ శ్రీహరిబాబు వెల్లడించారు.

భూ వివాదాలు లేకుండా చేసేందుకే రీ సర్వే

ఆర్డీవో మధులత

ఈపూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల మధ్య భూ వివాదాలు లేకుండా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రీ సర్వే చేస్తున్నట్లు నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కే మధులత అన్నారు. ఈపూరు తహసీల్దారు కార్యాలయంను బుధవారం ఆమె సందర్శించారు. రీ సర్వే పనులుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్‌లో ఏడు మండలాలలో ఏడు గ్రామాలలో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. కావూరు (చిలకలూరిపేట), కొచ్చెర్ల (ఈపూరు), ఏనుగుపాలెం (వినుకొండ), కొత్తలూరు (శావల్యాపురం), సరికొండపాలెం (బొల్లాపల్లి),త్రిపురాపురం (నూజెండ్ల) గ్రామాలలోని 29,275 ఎకరాలు రీ సర్వే చేస్తున్నారు. ప్రస్తుతానికి 7వేల714 ఎకరాలలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తయ్యాయి. డివిజన్‌లో 112 బ్లాక్స్‌గా విభజించి 32 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా డివిజన్‌లో పది గ్రామాలలో అగ్రహార భూములను కూడా సర్వే చేస్తున్నామన్నారు. నరసరావుపేట మండలం లింగంగుట్లలో సర్వే దాదాపుగా పూర్తయిందన్నారు. అంగలూరు, విప్పరపల్లి, నాగులవరం, శివాపురం, నూజెండ్లపల్లి, గుమ్మనంపాడు, అప్పాపురం, కొండప్రోలు, తిమ్మాపురం గ్రామాలలో ఈనాం భూముల సర్వే జరుగుతుందన్నారు. అంగలూరులో 1254ఎకరాలు అగ్రహారం భూమి ఉంది. అందులో 173 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. సమావేశంలో తహసీల్దారు ఏ నళిని, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఆర్డీవో మధులత

సర్వే పనుల పరిశీలన

రీ సర్వే త్వరతిగతిన పూర్తిచేయాలంటే రైతుల సహకారం అవసరమని నరసరావుపేట ఆర్డీవో కే మధులత అన్నారు. మండలంలోని కొచ్చెర్లలో జరుగుతున్న రీసర్వే పనులను బుధవారం ఆమె పరిశీలించారు. రైతులతో ఆర్డీవో మాట్లాడారు. రీ సర్వే సమయంలో అధికారులకు రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. భూమి హద్దులు నిర్ణయించిన తరువాత ఏమైనా సమస్య ఉంటే అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గ్రామంలో 5250 ఎకరాలు భూమి, 3046 ఖాతాలు ఉన్నాయన్నారు. అందులో ప్రభుత్వ భూమి 1021 ఎకరాలు, అసైన్డ్ భూమి 516 ఎకరాలు, దేవదాయశాఖ భూములు 121 ఎకరాలు, వక్ఫ్ బోర్డు భూమి 24 ఎకరాలు, పట్టా భూమి 3488 ఎకరాలు ఉందన్నారు. సర్వే సక్రమంగా జరిగేందుకు 15బ్లాక్‌లుగా విభజించి నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆమెతో పాటు తహసీల్దారు ఏ నళిని, ఆర్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

అబద్ధాల బ్రహ్మనాయుడు భాష మార్చుకో

● మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ టౌన్, మార్చి 5, (ఆంధ్రజ్యోతి): అబద్ధాల బ్రహ్మనాయుడు నీ భాష మార్చుకో అని తెలుగుదేశం పార్టీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుని హెచ్చరించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాజీ ఎమ్మెల్యే తీరును తీవ్రగా ఖండించారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ మండలంలోని ఉమ్మడివరంలో ఇటీవల ప్రభుత్వ భూమిలో అక్రమంగా క్రషర్ తవ్వకాలు చేస్తున్నవారిని గుర్తించి రెవెన్యూ అధికారులు పోలీసులు సాయంతో వాహనాలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన రఫీ అనే వ్యక్తి గ్రామస్థులను, సర్పంచిని దుర్భాషలాడారన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వాస్తవాలు తెలుసుకోకుండా, గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చుపెట్టడం తగదన్నారు. గ్రామాల్లో చిన్న విషయాలకు రాజకీయాలు అంటగట్టవద్దని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం తగదన్నారు. రఫీ కొంతకాలంగా మద్యం సేవించి పరుషపదజాలంతో దూషించిన వీడియోను విలేకరుల ముందు ఉంచారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కొంతమందిపై అక్రమ కేసులుపెడితే నేటికీ వారంతా కోర్టులు చుట్టూ తిరుగుతున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బొల్లాకు 70 సంవత్సరాలు వచ్చాయని గౌరవంగా వ్యవహరించాలని, అసత్య ప్రచారాలు మానుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులపై వ్యక్తిగత విమర్శలు, కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాదినేని ఆంజనేయులు, డీసీ మెంబరు ముత్తినేని ఏడుకొండలు, ఉమ్మడివరం సర్పంచి వీరగంధం ఆనంద్, గ్రామానికి చెందిన ఖాదర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: కిలారి

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన పల్నాడు జిల్లా సమన్వయ కర్త కిలారి రోశయ్య అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట జనసేన కార్యాలయంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిలారు రోశయ్య మాట్లాడుతూ నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేటలలో సన్నద్ధ సమావేశాలు నిర్వహించమన్నారు. విప్పటం, మచిలీపట్నం జరిగిన సభల కంటే భారీగా సభ జరుగుతుందన్నారు. జనసేన రాష్ట్రకార్యదర్శి సయ్యద్ జిలానీ మాట్లాడుతూ జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభ పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహిస్తారన్నారు. పల్నాడు జిల్లాలో ప్రతి నియోజవర్గం నుంచి 20 నుంచి 25 వేల మంది ఆవిర్భావ సభకు రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. నరసరావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది కార్యకర్తలు సభకు తరలివెళతారని ఆకాంక్షించారు. సమావేశంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాద్, బొడ్డపాటి శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: స్థానిక వెల్లటూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో కిలారి రోశయ్య ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన నాయకులందరూ సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు, నాగశ్రీనురాయల్, మండల పార్టీ అధ్యక్షుడు హనుమానాయక్, అడపాల అనిల్, గండికోట మణికంఠ, వీరమహిళలు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడల ఉత్పత్తి

● డాక్టర్ పి.రామారావు



మేలుజాతి దూడల యజమానులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

వినుకొండ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెంలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేలుజాతి లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పి.రామారావు మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ తమ ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేయించడం ద్వారా మేలు జాతి దూడలను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. పశు పెంపకం దారులందరూ ఏడాదికి ఒక దూడను తప్పనిసరిగా పొందాలని సూచించారు. అదేవిధంగా గుంటూరు జిల్లా డీఎల్‌డీఏ పశువైద్యాధికారి డాక్టర్ చలపతి మాట్లాడుతూ లింగనిర్ధారణ వీర్యం ద్వారా పెయ్య దూడలను ఉత్పత్తిచేసే పథకాన్ని పశుపెంపకందారులు వినియోగించుకోవాలన్నారు.

కార్యక్రమంలో 45 దూడలకు బహుమతులు అందజేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని వినుకొండ సహాయసంచాలకులు డాక్టర్ సరోజాదేవి తెలిపారు. కార్యక్రమంలో పిట్టంబండ పశువైద్యాధికారి డాక్టర్ శివాజీ, డాక్టర్ ఎం.మనోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం పోలీసులకు అప్పగింత

● చోరీచేసి పెట్రోల్ అయిపోయి వదిలివేత

వినుకొండటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని చోరీచేసి ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో వదిలేసిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎన్ఎస్‌పీ కాలనీలో దొంగలు వదిలేసిన హీరో ఫైన్ బండికి పెట్రోల్ అయిపోవడంతో దొంగలు అక్కడ వదిలి వెళ్లిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టణంలో వాహనాలను దొంగిలిస్తున్న ముఠా సంచరించడంతో ఇంటి బయట వాహనాలను పార్కింగ్ చేయాలంటే వాహన యజమానులు బెంబేలెత్తిపోతున్నారు. తరచూ పట్టణంలో ఏదోమూల ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. చోరీలపై పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి దొంగతనాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఫేస్ వాష్ అండ్ గో

నరసరావుపేట లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి), పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రహదారులపై ప్రమాదాలు జరగకుండా ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం చేపట్టినట్లు పోలీస్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లాలోని జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్ లను గుర్తించి డ్రైవర్లతో నీళ్లతో ముఖం కడిగించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. యడ్లపాడు, రొంపిచర్ల, రాజుపాలెం పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలోని తుమ్మలచెరువు టోల్గేట్ వద్ద రోడ్డు ప్రమాదాల జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళ జిల్లావ్యాప్తంగా పోలీసులు గస్తీలు నిర్వహించి బస్టాండ్ రైల్వే స్టేషన్లో కొత్త వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఏటీఎంలో బ్యాంకుల వద్ద గస్తీ నిర్వహించి జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

12న మండల పరిషత్ సమావేశం

నాదెండ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

రొంపిచర్ల, మార్చి 5 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల మండల వనరుల కేంద్ర భవనం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సమ్మె ఒప్పందాలు, హెచ్‌ఆర్ పాలసీ, మినిమమ్ టై స్కేల్, సంవత్సరానికి ఒకటే బడ్జెట్ రిలీజ్ చేయాలని, ప్రతి నెల 1వ తేదీన జీతాలు ఇచ్చేలా చూడాలని, జీవో నెంబరు 2 వర్తించేలా చొరవ తీసుకోవాని, గ్రాట్యుటీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మానవతా దృష్టితో సమగ్ర శిక్షా ఉద్యోగుల విన్నపాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

నరసరావుపేట కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం నుంచి పల్నాడు బస్టాండ్ మీదుగా ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు సాగింది. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ హెడ్ మాధురి యూనియన్ బ్యాంక్ నారీశక్తి, ఇతర పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉప ప్రాంతీయ అధికారులు మురళీమోహన్, సోమేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అభినందన

వినుకొండ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను వినుకొండ నియోజకవర్గ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ బృందం సభ్యులు మంగళవారం రాత్రి గుంటూరులో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, అదనపు ప్రధానకార్యదర్శి బి.వెంకటనాగేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి.సాంబశివరావు, రాష్ట్ర కౌన్సిల్ ఎస్.రాజాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

బల్లకట్టు, పడవలు, లాంచీల నిర్వహణపై జేసీ సమీక్ష

నరసరావుపేట రూరల్, మార్చి 5, (ఆంధ్రజ్యోతి), పల్నాడు జిల్లాలో నడుపుతున్న పడవలు బల్లకట్లు లాంచీల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి నిర్వహణకు లైసెన్స్‌లు, పర్మిట్లు ఉన్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. ఆ విధమైన అనుమతులు ఉన్న వాటినే అనుమతించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.రెండు కోట్ల మేరకు ధాన్యం వ్యాపారి టోకరా?

నరసరావుపేట లీగల్, మార్చి 5, (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని క్లాత్ మార్కెట్ వద్ద ఉన్న ఓ ధాన్యం వ్యాపారి రైతుల వద్ద నుంచి ధాన్యం నగదు తీసుకుని సుమారు రెండు కోట్ల రూపాయలు మేరకు ఎగవేసి వారికి ఐపీ నోటీసులు పంపినట్లు సమాచారం. బాధితులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారిని సమాచారం. సదరు వ్యాపారి కార్యాలయానికి ఇంటికి తాళాలు వేసి ఉడాయించినట్లు తెలిసింది.

'క్వింటా మిర్చి రూ.25వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి క్వింటాకు రూ.25వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభించాలని పల్నాడు జిల్లా రైతు-ప్రజా సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేసింది. బుధవారం అఖిలపక్ష రైతు సంఘాల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతును రక్షించండి-దేశాన్ని కాపాడండి అనే నినాదంతో మిర్చికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పీ అరుణబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై రాధాకృష్ణ, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రెడ్ బాషా, రైతు కూలీ సంఘం నాయకుడు రాంబాబు, పీడీఏ వై వెంకటేశ్వరరావు, కేఎన్‌పీఎస్ ఎన్ కృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

ఎస్ఎస్ఎన్ కళాశాలలో మెగా జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎస్ఎస్ఎన్ కళాశాలలో బుధవారం 22 ప్రముఖ కంపెనీల మెగా జాబ్ మేళా జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ తెలిపారు. మెగా జాబ్ మేళా గుంటూరు పేరల్, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పుష్పలత పాల్గొన్నారు. మెగా జాబ్ మేళాలో 22 కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. 450 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు.

ఇన్ఫోసిస్‌కు వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌కు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాదు బుధవారం తెలిపారు. గుంటూరు కిట్స్ కళాశాలలో నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో ఈ ఘనత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ పూర్తయిన తర్వాత ఏడాదికి రూ.3లక్షలు వేతనంగా అందజేస్తారన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కట్ల రామకోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

యలమందల విద్యార్థులకు ఉపకార వేతనాలు

నరసరావుపేట రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నలుగురు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. యలమందల ఉన్నత పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు జహీర్ కాజా, స్వప్న, విజయ సాగర్, ఫర్జానా విద్యార్థులు స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12వేల నగదు పొందుతారు.

క్రీడాకారులకు దుస్తుల వితరణ

యడ్లపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు ముత్తవరపు ఆంజనేయులు రూ.10వేల విలువైన క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. బుధవారం పాఠశాలలో వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు, క్రీడలలో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభారతి, ఎస్ఎంసీ చైర్మన్ రిహానా, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ ఖాదర్‌మస్తాన్, పీఈటీ పాల్‌సుధాకర్, కేవీ నాగరాజు, ఇస్మాయిల్, ఏఎంజీ రాజు, శ్రీకాంత్, మధు, అమీర్, ఆషితున్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్‌రాజ్





వినుకొండ టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌ను వినియోగించుకొని వాటర్ గ్రిడ్ పథకం ద్వారా 28 మండలాల్లో రూ.3,490 కోట్లతో తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్‌రాజ్ ఆంధ్రజ్యోతికి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: వినుకొండ నియోజకవర్గంలో వేసవిలో తాగునీరు నీరు ఎలా?

జవాబు: నియోజకవర్గంలో సీపీడబ్ల్యూఎస్ పథకంలో మొత్తం 14 ఉన్నాయి. ములకలూరు మినహా, అన్నింటికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో నీరు సరఫరా చేస్తున్నాం. పీడబ్ల్యూఎస్ పథకం కింద వినుకొండలో 12, శావల్యాపురంలో 13, ఈపూరులో 9, నూజెండ్లలో 12, బొల్లాపల్లి 26, ఎండబ్ల్యూఎస్ పథకం కింద వినుకొండలో 7, శావల్యాపురంలో 3, ఈపూరులో 8, నూజెండ్లలో 7, బొల్లాపల్లిలో 40 పథకాలు పనిచేస్తున్నాయి.

ప్రశ్న: సిబ్బంది కొరత ఏమైనా ఉందా? నీటి సమస్యను ఎలా ఎదుర్కొంటారు?

జ: వినుకొండ ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో కేవలం ఇద్దరు జేఈలే పనిచేస్తున్నారు. సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బందిని మండలానికి ఇద్దరు చొప్పున కేటాయిస్తే తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చు.

ప్రశ్న: తాగునీటి సరఫరా లేని గ్రామాలు ఏమైనా గుర్తించారా?

జ: వేసవి దృష్టిలో పెట్టుకొని బొల్లాపల్లి మండలంలోని దోమలగుండం, దోమలగుండం తండా, గండిగనుమల, షోలాయపాలెం గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నాం.

ప్రశ్న: నీటి సరఫరాకు అంచనాలు తయారు చేశారా?

జ: బొల్లాపల్లి మండలంలోని అయ్యన్నపాలెం, గుమ్మనంపాడు, రేమిడిచర్ల, రావులాపురం, మన్నేపల్లి తండా, గుట్లపల్లి తండా, కంద్రిక, గంగుపల్లి, గరికపాడు, పమిడిపాడు, చక్రాయపాలెం, మేకలదిన్నెతండాకు నీటి సరఫరా కోసం అంచనాల తయారీకి అధికారులకు ఆదేశించాం.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరా ఎలా?

జ: ప్రభుత్వం ద్వారా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరా చేయాల్సి ఉంది. పైపులైన్ ద్వారా నీటి సరఫరా అవకాశం లేని ప్రాంతాల్లో చేతిపంపులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలను కోరాం.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కొంటున్నారు?

జ: ఇప్పటికే ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో ఒక ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల ద్వారా తాగునీటి సరఫరాపై ప్రత్యేక ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. తద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుంది.

నూరు శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా పనిచేయండి


● మునిసిపల్ ఆర్డీ హరికృష్ణ



సమీక్షలో పాల్గొన్న మునిసిపల్ ఆర్డీ హరికృష్ణ, పక్కన కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా నూరు శాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేయాలని మునిసిపల్ రెవెన్యూ విభాగం అధికారులు, ఉద్యోగులను మునిసిపల్ ఆర్డీ హరికృష్ణ బుధవారం ఆదేశించారు. మునిసిపల్ రెవెన్యూ విభాగం వారితో మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. పన్నుల వసూలులో అలసత్వం ప్రదర్శించే ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పెండింగ్ పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజూ పన్నుల వసూళ్లపై సమీక్షించాలని, వసూళ్లలో వెనుక బడ్డవారిపై సిబ్బంది, ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. వచ్చే నెల నుంచి పట్టణంలో ప్రతిరోజూ తాగునీటి సరఫరా చేయడానికి అధికారులు సమాయుత్తం కావాలని కోరారు. ప్రజలకు జవాబుదారీగా వ్యహరిస్తూ, ప్రజల సమస్యలను పెండింగ్ లేకుండా పరిష్కరించటానికి అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, రెవెన్యూ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్



అన్న క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుషోత్తమపట్నంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సందర్శించి, అక్కడే టిఫిన్‌చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అతి తక్కువ ధరకు నాణ్యమైన ఫలహారాలను అందుబాటులో ఉంచిందన్నారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, పరిసరాలు శుభ్రంగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ



బస్ షెల్టర్‌కు భూమిపూజ చేస్తున్న డాక్టర్ రామకృష్ణ, టీడీపీ నాయకులు

నాదెండ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారి పక్కన నిర్మించనున్న బస్సు షెల్టర్ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన ఆర్కే హాస్పటల్ అధినేత డాక్టర్ చేపలమడుగు రామకృష్ణ దాతృత్వంతో సుమారు రూ.3.50 లక్షల వ్యయంతో ఈ బస్ షెల్టర్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రామకృష్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, పెంటాల శేషయ్య, కె.శ్రీను, కె.కృష్ణారావు, నరసింహారావు, శ్రీను మేస్త్రి, గాలి బుచ్చయ్య, డి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వరస్వామి తిరునాళ్ళ

యడ్లపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుచోల-గుత్తావారిపాలెం గ్రామాల మధ్య పీబీసీ కెనాల్ గట్టుపై ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయం 35వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జునశర్మ నేతృత్వంలో స్వామి వారికి తెల్లవారుజామునుంచే అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారికి పూలు, పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా కారుచోల గ్రామస్థులు రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేయగా, గుత్తావారిపాలెం గ్రామం నుంచి ఎల్ఈడీ లైట్లతో ప్రభను ఏర్పాటు చేశారు.